ఘనంగా తీజ్ సంబురాలు



రామకృష్ణాపూర్: గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్‌ను మందమర్రి మండలంలోని పులిమడుగు గ్రామంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢమాసంలో నిర్వహించే ఈ పండుగలో లంబాడాలు, బంజారాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు బాగా కురిసి, పంటలు సంవృద్ధిగా పండాలని కులదేవత సీత్లాభవానీ మాతకు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఘనంగా మడేలయ్య బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న రజకులు

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో మడేలయ్య బోనాల వేడుకలను గురువారం రజకులు ఘనంగా జరుపుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం నాయకులు మందపెల్లి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

23న కలప వేలం

జన్నారం: అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డ కలపను ఈ నెల 23న వేలం వేయనున్నట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఎఫ్, టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ సమక్షంలో వేలం జరుగుతుందని తెలిపారు. వేలంలో గతంలో కంటే తక్కువ ధరకు కలప లభిస్తుందన్నారు. ఆసక్తి గలవారు తమ పేర్లను నమోదు చేసుకుని, వేలంలో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్: 7337552150కు సంప్రదించాలని సూచించారు.

'అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించకండి'

మందమర్రిరూరల్: గృహ, షాపుల యజమానులకు టాక్స్ పే చేయాలని వచ్చే అపరిచిత ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి గూగుల్, ఫోన్ పే ద్వారా ఇంటి, షాపు ట్యాక్స్, షాపు డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ ట్యాక్స్ పే చేయాలని కాల్స్ వస్తే చెల్లించకుండా, మీకు సంబంధిత బిల్ కలెక్టర్‌కు గానీ, మీ సేవలో గాని మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు. కొంతమంది అపరిచిత వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని, ఈ విషయాలను ప్రజలు గమనించాలని సూచించారు.

నాట్లు వేసి నిరసన



గుంతల రోడ్లపై నాట్లు వేస్తున్న కార్యకర్తలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలో గుంతలమయమైన రోడ్డుపై గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. రోడ్లపై గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, గ్రామ రోడ్లను మరమ్మతు చేపట్టి రోడ్లు బాగు చేయాలని బీజేవైఎం గ్రామ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి చౌతకరి రాకేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు నల్ల రాజన్న, కార్యకర్తలు నిమ్మ శ్రీనివాస్, బోకిరి శ్రీకాంత్, గుడే రాజ్‌కుమార్, నల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో నాకాబందీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో గురువారం టూటౌన్ పోలీసులు ఆకస్మికంగా నాకాబందీ నిర్వహించారు. ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి టూటౌన్ ఎస్సై రవికుమార్ సిబ్బందితో కలిసి తనఖీ చేశారు. అనుమానం కలిగిన వ్యక్తులను వివరాలు అడిగి తెలుసుకుని పంపించారు. తనిఖీల్లో టూటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి



మంచిర్యాలక్రైం: మహిళల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబసమస్యలు, మహిళల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో అన్ని విధాల పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, నేరుగా తనను సంప్రదించాలన్నారు. షీటీం, తదితర కార్యక్రమాలు నిర్వహించి మహిళలను చైతన్య పరిచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

శ్రీరాంపూర్ సీఐగా రమేశ్‌బాబు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన సీఐగా జీ.రమేశ్‌బాబు రానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు సీఐలను గురువారం బదిలీ చేస్తు పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ప్రస్తుతం ఇక్కడ సీఐగా పని చేస్తున్న ఎంఎల్ఎం ముత్తులింగంను హైదరాబాద్ మల్టీ జోన్-1కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీలో పని చేస్తున్న రమేశ్‌బాబును ఇక్కడి శ్రీరాంపూర్ సీఐగా బదిలీ చేశారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

- ఉపాధిహామీ పథకంలో ఉచితంగా మొక్కలు పంపిణీ

భీమారం/కోటపల్లి/వేమనపల్లి/జన్నారం/తాండూర్/చెన్నూర్‌రూరల్: చిన్న, సన్నకారు రైతులు ఐదు ఎకరాల లోపు రైతులకు పంట చేన్లలో పండ్ల మొక్కల పెంపకంపై హార్టికల్చర్ అధికారులు, ప్రజాప్రతినిధులతో మండల కేంద్రాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జామ, సపోటా, నిమ్మ, దానిమ్మ మొక్కలు పెంచుటపై అధికారులతో మాట్లాడారు. సాగుకు ఉపాధిహామీ పథకం నుంచి ప్రోత్సాహకం, ఉద్యానవనశాఖ నుంచి డ్రిప్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని చిన్నసన్నకారు రైతులు కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్, జాబ్‌కార్డు అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పండ్ల తోటల పెంపకం లాభదాయకమని అన్నారు. గ్రామాల్లో ఉద్యానవన పంటల సాగు, కలిగే ప్రయోజనాలపై ప్రచారం చేయాలని, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానవన తోటల పెంపకానికి అర్హులైన రైతులను గుర్తించాలన్నారు. కార్యక్రమాల్లో కోటపల్లిలో ఎంపీడీవో భాస్కర్, ఏవో మహేందర్, ఎంపీవో అక్తర్, ఈసీ నాగేందర్, వేమనపల్లిలో ఎంపీడీఓ లక్ష్మయ్య, ఏపీఓ సత్యప్రసాద్, ఏఈఓలు సంతోష్, రుక్సార్ సుల్తానా, డ్రిప్ అధికారి ప్రసాద్, టీఏలు, ఎఫ్ఏలు, జన్నారంలో ఎంపీపీ మాదాడి సరోజన, ఎంపీడీవో అరుణరాణి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, ఏపీవో రవీందర్, ఎంపీవో రమేష్, విలాస్, భీమారంలో హార్టికల్చర్ అధికారి మహేందర్, జెడ్పీటీసీ తిరుమల, ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్‌లో మండల వ్యవసాయ అధికారిణి కిరణ్మయి, చెన్నూర్‌లో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ తిరుపతి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ పాల్గొన్నారు.



భీమారంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి మహేందర్

దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: ఉద్యానవన తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి వ్యవసాయ శాఖ ఏడీఏ ఎల్తూరి సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం రాయితీని వర్తింప జేస్తోందని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు వ్యవసాయ, ఉద్యానవన, ఈజీఎస్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

నెన్నెల: ఉపాధిహామీలో పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగి ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన వారు అర్హులవుతారన్నారు. 1బీ, జాబ్‌కార్డు, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లను ఈ నెల 31వరకు ఈజీఎస్ ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఏఈఓ, హెచ్ఓ, మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మామిడి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్‌బేర్, డ్రాగేన్‌ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ మొక్కలను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో పాటు పండ్ల తోటలకు రెండు, మూడు సంవత్సరాల నిర్వహణ ఖర్చులు కూడా లబ్ధిదారులకు ఇస్తుందన్నారు.

'కరెంట్‌పై కాంగ్రెస్ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు కరెంటు కోసం అనేక కష్టాలు పడితే, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా తొలగాయని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గూడెం రైతువేదిక వద్ద రైతులతో గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిత్యం రైతుల సంక్షేమం కోసం ఆలోచిస్తూ, సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు, చెరువులు మరమ్మతు చేయించారని గుర్తు చేశారు. కరెంటు కష్టాలు లేకుండా, ఉచితంగా 24గంటలు ఇస్తుంటే, దానిపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ అర్థరహిత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతుసమితీ గ్రామ కో ఆర్డినేటర్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతులకు ఉచిత కరెంట్ సరఫరాపై కాంగ్రెస్ పార్టీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొంటూ, రాబోయే ఎన్నికల్లో ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో గురువారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ స్వర్ణలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, సర్పంచులు మంచాల శ్రీనివాస్, గోళ్ల శ్రీనివాస్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం రైతువేదిక భవనంలో రైతులతో మాట్లాడి కాంగ్రెస్ నాయకులు కరెంటుపై చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, పట్టణాధ్యక్షులు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, సురేష్, మున్సిపల్ మేనేజర్ శ్రీహరి నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

జన్నారం: పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. గురువారం మండల కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు గట్టు రాజమల్లు, సుధాకర్, రవి, లచ్చన్న, బాపన్న, ఖాదర్, మల్లేశ్, భీమరాజ్, శ్రీను పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమను పర్మినెంట్ చేయాలని, జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కార్మికులు సమ్మె చేస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరవధిక దీక్ష చేపట్టారు.

కాసిపేట: మండల కేంద్రంలో దీక్షలు చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోశ్, వెంకట కృష్ణ, కోడి రమేశ్, రత్నం ప్రదీప్, రాజ్‌కుమార్, ప్రణయ్, షారూఖ్ పాల్గొన్నారు.



తాండూర్: టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మణిరాంసింగ్ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. నారాయణ, హరికిషన్ పాండే, హసన్, వెంకటేశ్, మల్లయ్య పాల్గొన్నారు.

కూలిన గూడెం ఘాట్‌రోడ్డు సైడ్‌వాల్



దండేపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గూడెం ఘాట్‌రోడ్డు ఒకటో మలుపు వద్ద 15మీటర్ల పొడవునా సైడ్‌వాల్ బుధవారం రాత్రి కూలింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. భక్తులు ఘాట్‌రోడ్డు వైపు వెళ్లవద్దని, ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

'ప్రార్థన మందిరాన్ని తొలగించాలి'

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ ప్రాథమిక పాఠశాల సమీపంలో అక్రమంగా నిర్మించిన అన్యమత ప్రార్థన మందిరాన్ని తొలగించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు దండేపల్లిలో తహసీల్దార్ హన్మంతరావుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జీపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొదట ఇల్లు నిర్మించుకుని, దానిని అన్యమత ప్రార్థనా మందిరంగా మార్చి, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. దీనిపై అభ్యంతరాలు తెలపడంతో, ఈ నెల 12న జరిగిన వివాదంలో హిందూ వర్గానికి చెందిన సురేష్ అనే వ్యక్తిని, అన్యమతస్తులు కత్తితో పొడిచి దాడి చేసి గాయపరిచారని పేర్కొన్నారు. వివాదాలకు దారితీయడంతో పాటు స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్న ప్రార్థనా మందిరాన్ని తొలగించాలన్నారు. లేదంటే, ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, లింగాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న హిందూ సంఘాలు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లిలో దిష్టిబొమ్మ దహనం చేస్తూ...



బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని కనకదుర్గాకాలనీలో బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సందర్శనకు వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కేసీఆర్ పోలీసులతో అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించినందుకు నిరసనగా, దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు సంతోష్‌రామ్, బద్రి సతీష్, బాపు, బాలాజీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి/లక్సెట్టిపేట: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ గురువారం బెల్లంపల్లి, లక్సెట్టిపేటలో బీజేపీ శ్రేణులు భగ్గుమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ తీవ్రంగా ఖండించారు. బెల్లంపల్లిలో వన్‌టౌన్ ఎస్సై రమేష్ సిబ్బందితో వచ్చి ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు.

మంచిర్యాలటౌన్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. దిష్టిబొమ్మ దహనంను పోలీసులు అడ్డుకోగా, ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శి బోయిని హరికృష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు రాకేశ్ రెన్వా, అధికార ప్రతినిధి పల్లె రాకేశ్, ముద్దం మల్లేశ్, హరికృష్ణ, రాకేశ రెన్వా, పల్లె రాకేశ్, అమిరిశెట్టి రాజు, అశోక్, కుర్రె చక్రవర్తి, సత్యనారాయణ, శివ, కావేటి మనీష్, పచ్చ వెంకటేశ్వర్లు, రాకేశ్, సాయి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ రిజిస్ట్రేషన్ సిస్టంపై అవగాహన

మందమర్రిరూరల్: ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సింగరేణిలో కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ రిజిస్ట్రేషన్ సిస్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశానికి కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య హాజరై మాట్లాడారు. వెబ్ అప్లికేషన్‌లో కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వివరాలు ఎలా పొందుపర్చాలనే వివరాలను తెలియజేశారు. ఎస్వో టూ జీఎం రాజేశ్వర రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఎస్వో రవీందర్, డీజీఎం సివిల్ శ్రీనివాస్, ఏరియాలోని రక్షణాధికారులు, క్లర్కులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న గురువయ్య

ఆర్‌కే ఓసీ ఏఐటీయూసీ ఫిట్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఫిట్ కమిటీ నాయకులు

రామకృష్ణాపూర్: ఏఐటీయూసీ యూనియన్ ఆర్‌కే ఓసీ ఫిట్ కమిటీని గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఫిట్ కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా సంపత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా జగదీశ్‌ను ఎన్నుకున్నట్లు బ్రాంచి కార్యదర్శి అక్బర్ అలీ తెలిపారు. మొత్తం 15మంది ఆఫీస్ బేరర్లతో పాటు 31మంది కార్యవర్గం, 45మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

క్రమశిక్షణతో పని చేయాలి



అభ్యర్థులతో జీఎం, ఇతర అధికారులు

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో క్రమ శిక్షణతో పని చేయాలని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లో 32మందికి కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు గురువారం అందించారు. కంపెనీ వ్యాప్తంగా 11311మందికి కారుణ్య ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. 3353మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ప్రతి ఉద్యోగి రక్షణతో పనిచేసి ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దడం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీ కేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్వోటూ జీఎం రఘుకుమార్, ఇందారం ఓసీపీ పీఓ శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థుల ఎంపిక

నస్పూర్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 2023-24విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అర్హత గల ఎస్టీ విద్యార్థినీ, విద్యార్థులను లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ తెలిపారు. సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ గురువారం ట్రెయినీ కలెక్టర్ గౌతమి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్‌రెడ్డితో కలిసి తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు.

వుడ్ ప్రీ ప్రాసెసింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి: హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన వుడ్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో గురువారం జిల్లాలోని ఔత్సాహికులు, యువకులకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై చిన్నయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఇతర వక్తలు మాట్లాడుతూ.. వుడ్ ప్రీ ప్రాసెసింగ్ శిక్షణ తరగతులను యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.

రీడింగ్ రూమ్ ఏర్పాటుకు చర్యలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని 22వార్డు భూడిదగడ్డ బస్తీలో పాఠకుల కోసం రీడింగ్ రూమ్‌ను సత్వరంగా అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ అశోక్‌గౌడ్‌తో కలిసి గురువారం మూసివేతకు గురైన ప్రభుత్వ యూపీఎస్ పాఠశాల భవనాన్ని సందర్శించారు. బస్తీలో గ్రంథాలయం కోసం పాఠశాల భవనాన్ని అందుబాటులో తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు.

'హక్కుల సాధనకే యాత్ర'

జన్నారం: డాక్టర్ బాబా సాహెబ్ వారసులైన నేతకానీ కులస్తుల హక్కుల సాధన కోసమే రాజకీయ చైతన్య యాత్ర చేపడుతున్నట్లు నేతకానీ సంఘం రాష్ట్ర నాయకుడు తాళ్లపెల్లి రాజేశ్వర్, సమన్వయ కమిటీ చైర్మన్ గంగేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో రాజకీయ యాత్రకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.

నీటి సమస్య పరిష్కరించాలి

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారంలో నీటి సమస్య పరిష్కరించాలని మహిళలు గురువారం ఎంపీడీవో కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా, ఎంపీడీవో అలీం హామీ ఇవ్వడంతో వినతిపత్రం సమర్పించి ఆందోళన విరమించారు. ఖాళీ బిందెలతో ఆందోళనకు వచ్చిన గ్రామస్తులకు బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు.

వార్డుల్లో మొక్కల పంపిణీ

మందమర్రిరూరల్/మంచిర్యాలటౌన్: మందమర్రి మున్సిపాలిటీ, మంచిర్యాల మున్సిపాలిటీలో పరిధిలోని వాలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది గురువారం మొక్కలు పంపిణీ చేశారు.

పంటల సాగుపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో ఏవో కవిత గురువారం పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజశేఖర్, సాగర్, శివరంజని, రైతులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని గురువారం బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. జైపూర్ నాయబ్ తహసీల్దార్ కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ అశోక్, శ్వేతాకుమారి, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను నరకవద్దు

వేమనపల్లి: పోడు భూముల సాగుపేరుతో అడవులను నరకవద్దని నీల్వాయి ఎస్సై సుబ్బారావు, కుశ్నపల్లి అటవీరేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ అన్నారు. నీల్వాయి పోలీసులు సమ్మయ్య, ఎఫ్ఎస్‌వోలు రవి, బేగ్, బీట్ అధికారి పోశం ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

బెల్లంపల్లి: ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం వ్యవసాయ అధికారులు అకస్మిక తనిఖీ చేశారు. ఏడీఏ ఎల్తూరి సురేఖ, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వందన పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, రక్తదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి కోరారు.

జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో గురువారం ప్రజాసంఘాల నాయకులు, గ్రామ పంచాయతీ ఉద్యోగులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్య కార్మికులు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారని, వారికి ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వకుండా ఉద్యోగభద్రత కల్పించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటోందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డూర్కె మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామ పంచాయతీ కారోబార్లు, కార్మికులు పాల్గొన్నారు.